# తీరని వేదన

రచన: శ్రీ ఎం.ఎస్.చలం

బావ అక్కయ్యకు మగడు కావటం దాని అదృష్టం. ఏ పూర్వజన్మ సుకృతంవల్లనో అతణ్ణి భర్తగా సంపాదించుకుంది. లేకుంటే అనాకారి అక్కయ్యకు అంత అందమైన భర్త యెలా దొరుకుతాడు!

బావదగ్గర అక్కయ్య యెంతో సుఖిస్తుంది. కాని బావను యెంతమాత్రం సుఖపెట్టలేదు. ఈ విషయమై నాకెందుకో గట్టినమ్మకం యేర్పడింది. బహుశా యితరుల మనస్తత్వాలను గుర్తించగలశక్తి నాకు లభ్యమైందేమో.!

అక్కయ్య అంటే నాకు యెన్నడూలేని యీర్ష్యకూడా ఆవేసించింది. నా సొత్తును ఆమె అపహరించిందనే భావం నాలో యేమూలనోదాగి యీ ద్వేషభావాన్ని కలిగించింది. ఇతరుల అదృష్టానికి ఓర్వలేనితనమే ద్వేషానికి చిహ్నమని తెలిసివుండికూడా నేనాభావాన్ని తొలగించుకోలేకపోతున్నాను.

బావ అందాన్ని అతని పెళ్లినాడు గుర్తించగల శక్తి నాకు వుండివుంటే అతణ్ణి అక్కవశం కానిచ్చేదాన్నికాదు! పోట్లాడ అయినా నా సొత్తుగా చేసుకునేదాన్ని. మూడేళ్ల తరువాత అతని సౌందర్యాన్ని గుర్తించిన నేరానికి జీవితమంతా యిలా బాధపడవలసిందే—తెలియక చేసే పొరపాట్లకు యింతటి పెద్ద శిక్షలు ఎందుకు విధింపబడుతున్నవో నాకు అర్థం కావటంలేదు!

సంక్రాంతికి బావ మా యింటికి వచ్చాడు. అక్కయ్య ఆనందాన్ని పట్ట పగ్గాలు లేకపోయాయి. సన్నగా తలదువ్వింది. ఆ బర్మా ముడిలో మణుగు మల్లెపువ్వుల జొనిపింది. కార్యంనాటి చీరకట్టి, ప్రేమను ఒలకబోస్తూ ఇంట్లో అటునుంచి యిటూ ఇటునుంచి అటూ లేడిలా గంతులువేస్తోంది. ఆ వాలకం చూస్తోంటే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

మధ్యాహ్నం గారెలతో నింపినపళ్ళెం చేత పట్టుకుని బావగదిలోకి వెళ్ళింది. బావ తింటోంటే అతని ముఖంవంక కళ్లు ఆర్పకుండా చూస్తోంది. బావ దానిముఖం చూడనేలేదు. రెండేరెండు గారెలుతిని మంచినీళ్లుత్రాగి మిగిలినవి పట్టుకుపొమ్మన్నాడు. మరో రెండు తినమంది. "వద్దు—తీసుకుపో"అన్నాడు బావ మర్యాదగా.

నేనేగనక అక్కయ్య మగణ్ణి అయివుంటే "ఛీ—పో" అనివుండేదాన్ని. నేనే బావను పెళ్లాడివుంటే ఆ గారెలన్నీ నవ్విస్తోతినిపించేదాన్ని. తినకంటే నోటిలో కూరేదాన్నికూడాను.

ఎందుకో బావ గారెలు తినలేదని జాలివేసింది నాకు. అక్కయ్య పాడుముఖం యెదురుగా లేకపోతే తినివుండునేమో!

* * *

ఎంతోమంది మగవాళ్ళను చూసి సిగ్గుపడని నేను బావ చూసిన చూపుకు సిగ్గుపట్టంలో నా బలహీనతను గుర్తించాను. ప్రతిమనిషికీ ఒక్కో విద్యలో ప్రావీణ్యతవున్నట్లే బావలోకూడా చూపులతో స్త్రీలను సిగ్గుపుట్టించగల సామర్థ్యంవున్నదేమో!

కొన్ని సంఘటనలు మన వూహలకుకూడా అందకుండా జరుగుతాయి. వాటినిగురించి "ఇలా యెందుకు జరిగిందీ?" అని ఆలోచించటం అవివేకం. వాటికి సమాధానాలు భూమ్యాకాశాలు ఏకమైనచోట లభించవలసిందే!

అక్కయ్యకు తోడుగా అమ్మకూడా ఆరాత్రి పంచపాళిలోనే పడుకుంది. నాన్న యేదో పనిమీద వూరువెళ్లారు. నేను నాగదిలో పడుకున్నాను. పడుకున్నా.నేగాని నిద్రపట్టటంలేదు.

(తరువాయి 78 వ పేజీలో)